యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధం!

- 1,47,856 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం
- 188 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- నమస్తే తెలంగాణ 'ఇంటర్వ్యూ'లో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డీఎం రవినాయక్

ఏ.రవినాయక్, జిల్లా మేనేజర్, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 6 : యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయడానికి జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేశాం.. కేంద్రాల వద్ద అన్ని మౌలిక వసతుల ఏర్పాట్లకు చర్యలు చేపట్టాం.. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నామని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ (డీఎం)రవినాయక్ తెలిపారు. యాసంగి (2024-25)లో జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలు, ధాన్యం సేకరణ లక్ష్యం, ఏర్పాటు చేసిన వసతులు తదితర వివరాలపై 'నమస్తే తెలంగాణ' రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌తో 'ప్రత్యేక ఇంటర్వ్యూ' నిర్వహించింది.

నమస్తే తెలంగాణ : ఈ యాసంగిలో ధాన్యం సేకరణ లక్ష్యం ఎంత..?

డీఎం : ఈ ఏడాది వ్యవసాయశాఖ అందించిన నివేదికల ప్రకారం 1.25లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 3.01 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. ఇందులో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో 1,47,856 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. ధాన్యం సేకరణకు గానూ ఇప్పటికే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చాం.

న.తె : కొనుగోలు కేంద్రాలు, టార్పాలిన్లు, రైతులకు ఎలాంటి ముందస్తు ఏర్పాటు చేస్తున్నారు.?

డీఎం : జిల్లావ్యాప్తంగా 188కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం. ఐకేపీ ద్వారా 102, సహకార శాఖ, పీఏసీసీఎస్ కేంద్రాలు 82, డీసీఎంఎస్ 4 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేసేందుకు 3608 టార్పాలిన్లు అందుబాటులో ఉంచాం. 188 క్యాలిపర్లు, 302 తూకం కొలిచే యంత్రాలు, తేమశాతం నమోదు యంత్రాలు 216, ప్యాడీ క్లీనర్లు 195 ఉన్నాయి.

న.తె : గన్నీ సంచుల కొరత ఉందా.. సన్నాలకు ఇచ్చే బోనస్ ధర రూ.500 అమలు తీరు ఎలా ఉండనున్నది.?

డీఎం: గన్నీ బ్యాగులుకు ఎలాంటి కొరత లేదు. మొత్తం 37లక్షల గన్నీ సంచులు అవసరం. ఇప్పటికే 90శాతం సిద్ధంగా ఉన్నాయి. అవసరం మేరకు సిద్ధం చేస్తాం. ఈ యాసంగిలో వరి పంటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రేడ్ ఏ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300లు మద్దతు ప్రకటించాయి. అంతే కాకుండా సన్నరకం ధాన్యానికి ప్రోత్సాహకంగా క్వింటాకు రూ.500లు బోనస్ ప్రకటించింది.

న.తె: రైతులకు డబ్బుల చెల్లింపుల్లో ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు.?

డీఎం : ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేసి ట్రక్ షీట్ రాగానే పౌర సరఫరాల శాఖకు వచ్చిన 48 గంటల్లోగా ఖాతాలో డబ్బులు జమయ్యేలా, ఏ రోజు విక్రయాలకు సంబంధించి అదే రోజు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

న.తె: సేకరించిన ధాన్యానికి నిల్వ గోదాంలు అందుబాటులో ఉన్నాయా.?

డీఎం : జిల్లాలో 68 రైస్‌మిల్లులు ఉండగా 2,02,750 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసే సామర్థ్యం ఈ రైస్ మిల్లులకు ఉంది. ధాన్యాన్ని నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగిన గోదాంలు అందుబాటులో ఉన్నాయి.

న.తె: రైతులకు మీరిచ్చే సలహా.?

డీఎం : రైతులు ధాన్యం తేమ 17 శాతానికి మించకుండా ఉండే విధంగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలి. కొనుగోలు కేంద్రం వద్ద సన్నరకం ధాన్యం నింపే గోనె సంచులకు ఎర్రధారంతో, దొడ్డు రకం ధాన్యం నింపే సంచులకు ఆకుపచ్చదారంతో కుట్లు వేయాలి.

న.తె : కేంద్రాల నిర్వాహకులకు ఏం చెబుతారు.?

డీఎం : కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు తర్వాత వెంటనే ఎంపీఎంఎస్ ఎంట్రీ చేయాలి. రైతుల నుంచి పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్‌కు సంబంధించిన వివరాలు తీసుకోవాలి. ఎక్కడా తప్పులకు ఆస్కారం, అవకాశం ఇవ్వొద్దు. ధాన్యం కొనుగోలులో ఏవైనా తప్పులు చేసినా, అందుబాటులో లేకున్నా ఇబ్బందులు సృష్టించినా కలెక్టర్ ఆదేశాల మేరకు కఠిన చర్యలు ఉంటాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి పత్రికల్లో వచ్చే వార్తలకు సంబంధిత కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు, అధికారులు వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. వేసవిని దృష్టిలో ఉంచుకుని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నీడ కల్పించేలా టెంట్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, కుర్చీలు ఏర్పాటు చేయాలి.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో హారతినిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మరికల్‌లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న నారాయణపేట ఎమ్మెల్యే దంపతులు

పాలమూరు: శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా రాములోరి కల్యాణం

- పులకించిన భక్తజనం
- మార్మోగిన రామనామం

పాలమూరు/హన్వాడ /గండీడ్ /మహమ్మదాబాద్ /జడ్చర్ల/ బాలానగర్/నవాబ్‌పేట/దేవరకద్ర/ దేవరకద్ర రూరల్ (కౌకుంట్ల)/మూసాపేట/నారాయణ పేట/మాగనూర్/ధన్వాడ, ఏప్రిల్ 6 : శ్రీరామ నవమి పురస్కరించుకొని మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో ఆయా మండలాలు, వివిధగ్రామాల్లోని ఆలయాల్లో ఆదివారం సీతారాముల కల్యాణ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణ ఘట్టాన్ని కనులారా వీక్షించి తరించారు. పచ్చని పందిరి, మామిడి తోరణాలతో అలంకరించిన మండపాలలో వేదపండితులు వేదమంత్రాలతో కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణాలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహబూబ్‌నగర్ పట్టణంలో టీచర్స్‌కాలనీ రామాలయం , సద్దల గుడు హనుమాన్ ఆలయం ,శ్రీనివాసకాలనీ పంచముఖి ఆంజనేయస్వామి ఆలయం , అప్పన్నపల్లి , ధనలక్ష్మీకాలనీ, మహబూబ్‌నగర్ రూరల్ మండలం మన్యంకొండ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం, హన్వాడ మండలంలోని పెద్దదర్‌పల్లి, పిల్లిగుండు తండాల్లోని ఆయా ఆలయాలలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.చిన్తకుంట మండలం దమగ్నా పుల్‌లో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి రాములోరి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దేవరకద్ర మండలంలోని నాగవరం గ్రామంలో కల్యాణోత్సవంలో మాజీ ఎంపీపీ రమా శ్రీకాంత్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జడ్చర్ల మండలంలోని గంగాపూర్ చెన్నకేశస్వామి ఆలయం, మల్లెబోయిన్‌పల్లి, బోయలకుంటలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత సీతారాముల కల్యాణం వేడుకల్లో పాల్గొన్నారు.బాలానగర్ మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో రామాలయ నిర్మాణానికి గానూ భక్తులు రూ. 5 లక్షలు విరాళం ప్రకటించారు. సాయంత్రం శ్రీరాముడి విగ్రహంతో బాలానగర్ మండల కేంద్రంలో శోభా యాత్రను నిర్వహించారు.నారాయణపేట మండలం అప్పిరెడ్డిపల్లి శ్రీరామ గుట్టపై రాంమందిరం, మరికల్ ఆయా గ్రామాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణ వేడుకలో పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పాల్గొన్ని పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి స్వామివారికి పూజలు చేశారు. నారాయణ పేట జిల్లా కేంద్రంలోని విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో పల్ల హనుమాన్ ఆలయం నుంచి పుర వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించగా ఎస్పీ యోగేశ్‌గౌతమ్ ప్రారంభించారు.మూసాపేట మండల కేంద్రంలో పాటు మండలంలో వివిధ గ్రామాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే జీ. మధుసూదన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

జడ్చర్లలో సీతారామస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

దేవరకద్ర మండలంలోని బస్వాయిపలిలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ టీచర్స్‌కాలనీ రామాలయంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు

అడ్డాకులలో కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్


చౌదర్‌పల్లిలో మంగళసూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చకుడు

మార్మోగిన రామనామస్మరణ

మక్తల్ : సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూరు అభయాంజనేయస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

మక్తల్/ మాగనూరు ఏప్రిల్ 6 : శ్రీరామనవమి పురస్కరించుకొని మక్తల్ పడమటి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంతంలోని రామ్‌లీలా మైదానంలో ఏర్పాటు చేసిన సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా కొనసాగింది. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దంపతులు రాములవారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని కల్యాణాన్ని నిర్వహించారు. మక్తల్ మండలం సంగంబండ గ్రామ ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు. మాగనూరు మండలంలోని ఉజ్జలి గ్రామంలో కొనసాగుతున్న శ్రీదక్షిణముఖి అభయాంజనేయ స్వామి జాతర సందర్భంగా ఆదివారం మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు కూల్ అద్దాలు పంపిణీ

ట్రాఫిక్ సిబ్బందికి కూలింగ్ గ్లాసెస్ అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ నరేందర్ , డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ , ఏప్రిల్ 6 : పట్టణంలో విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు వేసవి నేపథ్యంలో కూలింగ్ అద్దాలను బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ నరేందర్ అందజేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పాలకొండ తాజా మాజీ కౌన్సిలర్ నరేందర్ ఎండ వేడికి రోడ్లపై విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ పోలీసుల బాధలు చూసి వారికి కూలింగ్ అద్దాలు పంపిణీ చేసి మంచి మనసును చాటుకున్నారు. ఎండల్లో విధులు నిర్వరిస్తూ ఇబ్బంది పడుతున్న వారి సమస్యలను చూసి ఆయన విషయం డీఎస్పీ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఎండలు ముదిరి పోతున్న నేపథ్యంలో వారికి తన వంతుగా సాయంగా నాణ్యతతో కూడిన కూలింగ్ అద్దాలు సొంత ఖర్చుతో ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు డీఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసుల పనితీరు చాలా గొప్పగా ఉందని, ఎండలు ముదురు తున్నా నేపథ్యంలో కూడా నిత్యం తమ సిబ్బంది విధి నిర్వహణలో చక్కగా పనిచేస్తున్నారని, తమ ట్రాఫిక్ సిబ్బందికి నరేందర్ కూలింగ్ గ్లాసెస్ ఇవ్వడానికి ముందుకు రావడం గొప్ప విషయమని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ భగవంత్‌రెడ్డి, ఎస్సై, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు ,ట్రాఫిక్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

శ్రీరాముడి జీవితం మనందరికీ ఆదర్శం

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి


అన్నాసాగర్‌లో సీతారాముల కల్యాణం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు

భూత్పూర్, ఏప్రిల్ 6 : శ్రీరాముడి జీవితం మనందరికీ ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా అన్నాసాగర్‌లో స్వామివారి కల్యాణోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడి తన సతీమణి మంజుల, కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి వస్త్రాలను తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో మాజీ ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పాటు ఇటీవల వివాహం జరిగిన తన కూతురు ప్రీతిరెడ్డి-భరత్‌చంద్రారెడ్డి తదితరులు కూర్చున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆల శ్రీకాంత్‌రెడ్డి, షాకీర్, వెంకటేశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మరికల్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం

నారాయణపేటరూరల్, ఏప్రిల్ 6 : సత్యసాయి భక్త బృందం ఆధ్వర్యంలో పేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలి వేంద్రం కేంద్రాన్ని ఆదివారం పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు సత్యసాయి సేవా సమితి వారు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సేవా సమితి సభ్యులు ఎమ్మెల్యేను, డీఎం లావణ్యను శాలువాతో సన్మానించారు. అదేవిధంగా మరికల్ మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద మరికల్ యువక మండలి ఆధ్వర్యంలో రామ్‌దేవ్ బాబా ఫ్యాషన్ జగదీశ్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రం కేంద్రాన్ని ఆదివారం పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ప్రారంభించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

నవాబ్‌పేట, ఏప్రిల్ 6: మండలంలోని కాకర్లపహాడ్ గ్రామానికి చెందిన మరిపల్లి కేశవులు(46) అనే వ్యక్తి చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాకర్లపహాడ్ గ్రామానికి చెందిన కేశవులు శనివారం మద్యం తాగి గ్రామ శివారులో ఉన్న ఉంగరం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి తాగిన మైకంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కాగా కేశవులు శనివారం చెరువులో పడి మృతి చెందగా...అతడి శవాన్ని ఆదివారం గుర్తించి చెరువు నీటిలో నుంచి వెలికితీసినట్లు ఎస్సై వివరించారు. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో మహబూబ్‌నగర్ ఎంపీ

మహబూబ్‌నగర్ టౌన్ , ఏప్రిల్ 6 : మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన బీజేపీ ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, దేవరకద్ర నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ కొండ ప్రశాంత్‌రెడ్డి, పాల్గొన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ,జీఎస్ రమేశ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ ముఖ్య నాయకులు , గ్రామ , మండల , జిల్లా నాయకులు పాల్గొన్నారు.

శ్రీరాముడి దీవెనలు నియోజకవర్గ ప్రజలకు ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

చింతాల్‌దిన్నెలో రాములోరిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూర్, ఏప్రిల్ 6 :శ్రీరాముడి చల్లని దీవెనలు కొడంగల్ నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని చింతాల్‌దిన్నె గ్రామంలోని రామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో ఆయన పాల్గొన్ని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రతి పల్లెను అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అడ్డాకులలో సామూహిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

మూసాపేట(అడ్డాకుల), ఏప్రిల్ 6 : ప్రతి పల్లెను అభివృద్ధి చేస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. అడ్డాకుల మండల కేంద్రంలోని శివాంజనేయ షిరిడిసాయి ఆలయ వద్ద సామూహిక భవన నిర్మాణానికి ఎమ్మెల్యే స్థానిక నాయకులతో పాటు కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 20 లక్షలతో సామూహిక భవన నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆలయం జరిగే సీతారాముల కల్యాణ వేడుక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొనారు. తుంకినీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, శెట్టి చంద్రశేఖర్, శ్రీహరి, బగ్గి కృష్ణయ్య, విజయమోహన్‌రెడ్డి, సీజీ గోవర్ధన్, కృష్ణయ్యతో పాటు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

బి.సాయి వివేక్

ఎండీ.నవాజ్

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 6 : ఒడిశా రాష్ట్రంలో ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న 39వ సబ్ జూనియర్ (బాలుర) జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు సాయి వివేక్, నవాజ్ ఎంపికయ్యారు. వీరు తెలంగాణ జట్టులో చోటు దక్కించుకున్నారు. ఆదివారం ఒడిశాకు బయలుదేరుతున్న క్రీడాకారులను సంఘం అధ్యక్షుడు రజినీకాంత్,జియ వుద్దీన్, హమద్ ఉసేన్, కోచ్ ప్రదీప్, ప్రణయ్ అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

రక్తదాత నటరాజ్‌కు మానవత వీరుడు అవార్డు ప్రదానం

ఒడిశాలో రక్తదాతగా జాతీయస్థాయి మానవతా అవార్డు అందుకుంటున్న రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 6 : పాలమూరు వాసికి జాతీయస్థాయిలో రక్తదాత నటరాజ్‌కు మానవత వీరుడు అవార్డు లభించింది. ఒడిశా రాష్ట్రంలో జిల్లా రక్త దాతలు, ప్రేరేపకుల ఫోరం కోరావుట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్త దానంపై రెండు రోజుల పాటు జరిగిన జాతీయ కాన్ఫరెన్స్ ముగింపు సందర్భంగా జాతీయ స్థాయిలో వందసార్లకు పైగా రక్త దానం చేసిన రక్త దాతలకు మానవత వీరుడు అవార్డులను ప్రదానం చేశారు. అయితే 167 సార్లకు పైగా రక్తదానం చేసి సమాజానికి స్ఫూర్తిగా నిలిచిన రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్‌కు మానవత వీరుడు అవార్డును ప్రదానం చేశారు. కోరావుట్ జిల్లా కలెక్టర్ కీర్తి వాసన్, ఎమ్మెల్యే రఘురామ్, జిల్లా రక్త దాతల ప్రేరేపకుల ఫోరం అధ్యక్షుడు సంజీవ్, కార్యదర్శి షేక్ ఇబ్రహీంల చేతుల మీదుగా లయన్ నటరాజ్ మానవత వీరుడు అవార్డు అందుకున్నారు. కాగా రక్తదాతగా జాతీయ స్థాయి అవార్డు అందుకున్నా లయన్ నటరాజ్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

ఇసుక టిప్పర్లు పట్టివేత

పట్టుబడిన ఇసుక టిప్పర్లు

కృష్ణ, ఏప్రిల్ 6 : మండలంలోని గుడెబల్లూర్ పంచాయతీ పరిధిలో గ్రామ సమీపంలో కృష్ణ నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆరు టిప్పర్లను కృష్ణ మండల పోలీసులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కృష్ణ నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను పట్టుకొని డ్రైవర్లు మందర్ చౌదరి, దేవ్, పరశురాం, ఆకాశ్, మల్లు, తోటప్పలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నవీద్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

అర్జెంటుగా కావలెను
★అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. వసతి సౌకర్యం కలదు. మంచి జీతం కలదు. సంప్రదించండి: 9392663777, 9246663777.
NT-329238

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748